క్లుప్తంగా

అనాథ శవానికి అంత్యక్రియలు



మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్తున్న అవర్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు

కంచరపాలెం: జ్ఞానాపురం రైల్వేస్టేషన్ రహదారిలో భిక్షాటన చేసుకునే అనాథ వృద్ధుడు (70) మంగళవారం మరణించాడు. స్థానికులు కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అవర్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు ముందుకు వచ్చి మృతదేహానికి కాన్వెంట్ కూడలి శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవర్ హ్యాండ్స్ అధ్యక్షుడు పిల్లి గోవిందరాజు, ఐతి మధుబాబు, రవికుమార్, శివ, హెడ్ కానిస్టేబుల్ వి.వెంకట్రావ్, మొబైల్ కానిస్టేబుల్ రాంబాబు, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆహార కల్తీకి పాల్పడే వారిపై చర్యలకు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మండల్ ప్రతినిధి ప్రియాంక దండి తదితరులు

మహారాణిపేట: ఆహార కల్తీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాయి వంజి బాబా గ్రామీణ వికాస్ మండల్ నగర కార్యదర్శి కాండవ గాయిత్రి కోరారు. మంగళవారం మండల్ ప్రతినిధి బృందం కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. కేంద్ర ఆహార భద్రత, ప్రమాణాల చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మండలికి చెందిన ప్రియాంక దండి, దీప్తి, శ్రీదేవి తదితరులు ఉన్నారు.

పటిష్టంగా వేట నిషేధం



మాట్లాడుతున్న జేడీ చంద్రశేఖరరెడ్డి. చిత్రంలో ఏడీ విజయకృష్ణ

మహారాణిపేట: రెండు నెలల పాటు తూర్పు తీరంలో చేపల వేట నిషేధాన్ని పటిష్టంగా అమలు చేయాలని మత్స్యశాఖ ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ ఎ. చంద్రశేఖరరెడ్డి అన్నారు. మంగళవారం ఫిషింగ్ హార్బర్ వద్ద గల మత్స్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. వేట నిషేధ సమయంలో సముద్రంలో ఎలాంటి వేట చేయరాదని, 60 రోజుల పాటు మత్స్య సంపద పరిరక్షణ, పునరుత్పత్తి, నిర్వహణ దృష్ట్యా నిషేధం అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతమ్మధార: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. పోర్ట్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు...పోర్ట్ హాస్పిటల్ సమీపంలోని అబిద్ నగర్‌లో ఈనెల 13న ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడు వివరాలు తెలిస్తే సంప్రదించాలని పోలీసులు కోరారు.

ఎస్‌బీఐ ఖాతాదారులకు ఉచిత వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సీతమ్మధార: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారకానగర్ బ్రాంచ్‌లో మంగళవారం ఖాతాదారులకు బ్యాంకు ఆవరణలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. వి హెల్త్ కేర్, వి డెంటల్ ఆస్పత్రులు సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో బీపీ, షుగర్, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 150 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ వి. స్వర్ణలత, వి హెల్త్ కేర్ డైరెక్టర్ కేఎంకే రమేష్, క్లినిక్ హెడ్ సీహెచ్ కృష్ణ, వైద్య బృందం లతీష, తులసి, లిఖిత్ తదితరులు సేవలందించారు.

చల్లకుండ



- మట్టి కుండలకు పెరిగిన గిరాకీ
- ఈ నీటి వాడకం ఆరోగ్యానికి మంచిదంటున్న వైద్యులు
- వేసవి కావడంతో పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



అమ్మకానికి సిద్ధమైన మట్టి కుండలు

దాబాగార్డెన్స్: ఆధునిక కాలంలో కూడా పేదవాడి ఫ్రిజ్‌కు ఆదరణ తగ్గలేదు. ఎండల తీవ్రత పెరుగుతుండడంతో మట్టి కుండలకు గిరాకీ పెరిగింది. నగరంలోని అల్లిపురం కుమ్మరవీధి, మెయిన్ రోడ్డు విశ్వేశ్వరాలయం ఎదురుగా గల కుమ్మరవీధి, పూర్ణామార్కెట్, దొండపర్తి కుమ్మరి వీధి తదితర ప్రాంతాలు మట్టికుండల అమ్మకాలకు కేంద్రంగా నిలుస్తున్నాయి. ఎండలు రోజురోజుకి పెరుగుతుండడంతో వేలు ఖర్చు చేసి ఫ్రిజ్‌లు కొనలేని పేద, మధ్య తరగతి ప్రజలు మట్టికుండల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ఫ్రిజ్‌లోని నీటి కంటే మట్టికుండలోని నీరే ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతుండడంతో ఫ్రిజ్‌లు ఉన్నవారు సైతం మట్టి కుండల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు. రోజుకు ఒక్కో కుటుంబం 25 కుండలు తయారు చేసి ఒక్కో కుండ రూ.120 నుంచి రూ.140 వరకు హోల్‌సేల్ ధరలకు విక్రయిస్తున్నారు. వేసవి తొలివారం వరకు రోజుకు 20 నుంచి 30లోపే కుండల అమ్మకాలు జర్గా, ఇటీవల రోజుకు సుమారుగా 50 వరకు మట్టి కుండల విక్రయాలు జరుగుతుండడం విశేషం. వచ్చే నెలలో అమ్మకాలు మరింత పెరిగే అవకాశముందని విక్రయదారులు చెబుతున్నారు. కుండ సైజును బట్టీ ఒక్కోటి రూ.100 నుంచి రూ.300కు పైగా పలుకుతుంది. దీంతో కుండల తయారీదారులు, విక్రయదారులు తమ ఆదాయం మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మారని బతుకులు..

మట్టికుండల తయారీదారుల బతుకులు మారలేదు. గతంలో విశాఖ మహానగరంలో కుండలు తయారు చేసే శాలివాహన కుటుంబాలు 200కు పైగా ఉండేవి. తయారు చేసిన కుండలను విశాఖ నగరంతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలు, రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేసేవారు. వేసవిలో మినహా మిగిలిన కాలాల్లో కుండలకు తగిన ఆదరణ లేకపోవడంతో కుటీర పరిశ్రమ కుంచించుకుపోయింది. ప్రస్తుతం ఆ సంఖ్య పరిమితంగానే మిగిలింది. అది కూడా విశాఖ జిల్లా అనకాపల్లి, యలమంచిలి ప్రాంతాల్లోనే మట్టికుండల తయారీ జరుగుతోంది. గతంలో మాదిరిగా విశాఖ నగరంలో మట్టి కుండల తయారీ ఎక్కడా కానరావడం లేదు. వేరే ప్రాంతాల నుంచి దిగుబడి చేసుకుని ఇక్కడ విక్రయిస్తున్నారు. ఆ వృత్తిని వదిలేసిన కుమ్మరుల్లో చాలా **కుటుంబాలు వేరే ఉపాధిబాట పట్టా**యి. గతంలో పేద, మధ్య తరగతితో పా టు ఉన్నత వర్గాల ప్రజలు **మట్టి పాత్రలపై మమకారం చూపే**వారు. నేటి ఆధునిక యుగంలో ప్లాస్టిక్, స్టీల్ వస్తువుల రాకతో మట్టి **పాత్రలు నిరాదరణకు గురికావడం వ**రిశ్రమపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఏడాది మొత్తంలో వేసవి **కాలంలో మాత్రమే కుండలకు గిరాకీ** ఉంటుంది. జనవరిలో తయారీ ప్రారంభించి మే నెల వరకు విక్రయాలు కొనసాగుతాయి. **గతంలో** పల్లెలతో పాటు పట్టణాల్లో కూడా మట్టి కుండల్లోని చల్లని నీరు **తాగేందుకు ఇష్టపడేవారు. ప్రస్తు**తం మార్కెట్‌లో కూలింగ్ క్యాన్లు, ఫ్రిజ్‌లు విరివిగా రావడంతో **కుండల వినియోగంపై ప్రభావ**ం పడుతోంది. మట్టి పాత్రల కొనుగోలు తగ్గిపోతుండడంతో **వృత్తిపై ఆధారపడేవారు వే**రే వృత్తుల వైపు మరలుతున్నారు. ఇదే వృత్తిపై ఆధారపడిన వారు **సైతం వ**యసు మీరి పని చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. **యాభై సంవత్స**రాలు దాటిన వృత్తిదారులకు ప్రభుత్వం ఆర్థిక **సహాయం** అందించేలా చర్యలు తీసుకోవాలని వీరు కోరుతున్నారు.



మట్టి కుండలు కొనుగోలు చేస్తున్న మహిళ



వ్యాపారం కొంత ఫర్వాలేదు..

"గతంలో జనవరి నుంచే పెద్ద ఎత్తున కుండల తయారీ జరిగేది. ఏడాదిలో మూడు నెలలు సీజన్ కాగా మిగిలిన తొమ్మిది నెలలు ఉపాధి వెతుక్కోవాల్సిందే. వేసవి కాలం మూడు నెలలు వ్యాపారం బాగుంటుంది. ఇళ్లల్లో ఫ్రిజ్‌లు ఉన్నవారు కూడా మట్టి కుండలు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పుడు పల్లెల్లోనూ ఫ్రిజ్‌లు, కూలింగ్ క్యాన్లు వాడుతుండడంతో కుండల వ్యాపారం కొంత తగ్గినప్పటికీ మట్టి కుండల్లో నీరు తాగడం శ్రేయస్కరమన్న ఉద్దేశంతో మట్టికుండలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో వ్యాపారం కొంత వరకు బాగానే ఉంది."
–నాని, మట్టి కుండల విక్రయదారుడు, కుమ్మరవీధి, 30వ వార్డు

రైల్వే ప్రైవేటీకరణ తగదు



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిటు నాయకులు

దాబాగార్డెన్స్: రైల్వే ప్రైవేటీకరణ యోచనను విడనాడాలని, భద్రతా ప్రమాణాలు చేపట్టాలని కోరుతూ ఈ నెల 19న అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం సిటు కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి ఆర్‌కే ఎస్‌వీ కుమార్, పలువురు నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం కుమార్ మాట్లాడుతూ సదస్సుకు ముఖ్య వక్తగా సిటు అఖిల భారత అధ్యక్షురాలు కె. హేమలత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, రైల్వే యూనియన్ నాయకులు ఉమామహేశ్వరరావు, ఇతర ఫెడరేషన్ నాయకులు హాజరవుతారని తెలిపారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రజల సంపదైన రైల్వేలను పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం ప్రైవేటీకరించే విధానాలను దూకుడుగా అమలు చేస్తోందన్నారు. ప్రైవేటీకరణ వల్ల నాణ్యత తగ్గిపోతుందన్నారు. సదస్సులో పెద్ద ఎత్తున ఉద్యోగులు, కార్మిక సంఘాలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్. జ్యోతీశ్వరరావు, ఈస్ట్ కోస్ట్ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి. జగన్ తదితరులు పాల్గొన్నారు.

అనూష భర్తను కఠినంగా శిక్షించాలి

ఏపీ మహిళా సమాఖ్య డిమాండ్



కేజీహెచ్ మార్చురీ వద్ద నిరసన వ్యక్తం తెలుపుతున్న మహిళలు

మహారాణిపేట: మధురవాడకు చెందిన నిండు గర్భిణి అనూషను కడతేర్చిన భర్తను కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి అత్తిలి విమల డిమాండ్ చేశారు. మంగళవారం కేజీహెచ్ మార్చురీ వద్ద సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విమల మాట్లాడుతూ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. హోమ్ మంత్రి అనిత ఈ ఘటనపై స్పందించకపోవడం దారుణమని, సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టి మహిళలకు రక్షణ కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కె.వనజాక్షి, కార్యదర్శి ఎం.డి బేగం, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలకు హద్దే లేదు

27వ వార్డులో ఇష్టారాజ్యంగా షెడ్డు ఏర్పాటు



ద్వారకానగర్ 6వ లైన్‌లో అక్రమ షెడ్డు

సీతమ్మధార: నడిరోడ్డుపై అక్రమంగా షెడ్డు నిర్మిస్తున్నా అధికారులకు పట్టడం లేదు. పైగా దానికి అసెస్‌మెంట్ నంబర్ నుంచి విద్యుత్ కలెక్షన్ వరకు అన్నీ క్షణాల్లో మంజూరు చేసేయడం గమనార్హం. జీవీఎంసీ 27వ వార్డు ద్వారకానగర్ 6వ లైన్, భగత్ సింగ్ కాలనీలో సచివాలయం పక్కనే అక్రమ నిర్మాణం చేపట్టినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ అక్రమ నిర్మాణానికి స్థానిక టౌన్‌ప్లానింగ్ అధికారులు, సచివాలయ సెక్రటరీలే సహాయ సహకారాలు అందిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. శుక్రవారం రాత్రి మొదలు పెట్టిన షెడ్డు నిర్మాణం ఆదివారం నాటికి పూర్తి చేసేశారు. దానికి బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. అలాగే షెడ్డుకు 47–1–92 డోర్ నంబర్, 1086121516 అసెస్‌మెంట్ నంబర్, 130ఎ041171356 నంబర్‌తో ఎలక్ట్రికల్ కనెక్షన్ సైతం మంజూరు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలోని రోడ్ల మీదే అక్రమ నిర్మాణాలు, బడ్డీలు ఇష్టానుసారంగా వెలుస్తున్నాయి. రోడ్డు పక్కనే అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోకపోగా.. వాటికి వంత పాడుతుండడం విశేషం.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా

సీపీ శంఖబ్రత బాగ్చి



స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ఉక్కునగరం: నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మంగళవారం స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్‌ను మొత్తం నిశితంగా పరిశీలించారు. పరిసర ప్రాంతాలను వ్యర్థాలతో నింపకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటాలని ఆదేశించారు. టౌన్‌షిప్‌లో దొంగతనాలు, అసాంఘిక చర్యలు జరకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, సీసీ కెమెరాలు మరిన్ని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీ షీటర్లు, అనుమానితుల కదలికలను గమనించాలన్నారు. స్టేషన్ పరిధిలో ఒక్క గంజాయి పెడ్లర్ కూడా ఉండరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్ ఆవరణలో ఉన్న పెండింగ్ వాహనాలను పరిశీలించి వాటి డిస్పోజల్‌కు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫైళ్లను పరిశీలించి పెండింగ్ కేసులు వెంటనే పరిష్కరించాలని, అన్ని రికార్డులు అప్‌డేట్‌గా ఉండేలా చూడాలని ఆదేశించారు.

చావులమదుం బ్రిడ్జి కింద నిలిచిపోయిన మురుగునీరు

- ట్రాఫిక్ జామ్‌తో వాహన చోదకుల అవస్థలు
- క్రమబద్ధీకరించిన ట్రాఫిక్ పోలీసులు



బ్రిడ్జి ముందు నిలిచిపోయిన ట్రాఫిక్



చావులమదుం అండర్ బ్రిడ్జి కింద నిలిచిపోయిన మురుగునీరు

అల్లిపురం: చావులమదుం అండర్ బ్రిడ్జి కింద మంగళవారం మధ్యాహ్నం మురుగునీరు భారీ ఎత్తున నిలిచిపోయింది. ఎటువంటి వర్షం లేకుండానే భారీ ఎత్తున మురుగునీరు అక్కడ చేరడంతో పాదచారులు, వాహన చోదకులు ప్రయాణించేందుకు ఇబ్బందులు పడ్డారు. దీంతో వాహన చోదకులు ముఖ్యంగా ద్విచక్ర వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దుర్వాసనతో ఆ ప్రాంతం అంతా నిండిపోయింది. టూటౌన్ ట్రాఫిక్ పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మానవ హక్కులపై అవగాహన



హక్కులపై అవగాహన కల్పిస్తున్న హ్యూమన్ రైట్స్ సంస్థ ప్రతినిధులు

సీతంపేట: కేవీఆర్ ఫౌండేషన్, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో వివిధ చట్టాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఉపకార్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు కంచర్ల అచ్యుతరావు ముఖ్య అతిథిగా పాల్గొని హ్యూమన్‌రైట్స్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను ప్రశంసించారు. వృద్ధులు, వికలాంగులు, మతిస్థిమితం లేని వారు, యాచకులు, పేదవారికి సంస్థ చేస్తున్న సేవలను అభినందించారు. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొడ్డపాటి దాసు, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కనపర్తి ఇందిరా ప్రియదర్శిని, నేషనల్ కన్వీనర్ శశిరేఖ, ఈసీ మెంబర్ ఎస్.ఝాన్సీ, కన్జ్యూమర్ ఫౌండేషన్ చైర్మన్ మఠ్రి సత్యనారాయణ తదితరులు హక్కులపై అవగాహన కల్పించారు.

వైభవంగా పోలమాంబ జాతర



విశేష అలంకరణలో పోలమాంబ అమ్మవారు



ఆశిపాప వీధిలో వెలసిన పోలమాంబ



అమ్మవారి ఉత్సవ విగ్రహంతో తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు

అల్లిపురం: కొబ్బరితోట వాసుల కొంగుబంగారం శ్రీ పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కొబ్బరితోట, ఎస్వీపీ నగర్, నేతాజీనగర్, ద్రోణంరాజునగర్, మురళీధరవీధి, అచ్చియ్యమ్మపేట, కొబ్బరితోట పోలమాంబ దేవాలయం వరకు తిరువీధి ఉత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులు కలశాల్లోని నీటితో అమ్మవారిని అభిషేకించారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కుంకుమ పూజలో మహిళలు పాల్గొన్నారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు గంటా శ్రీనివాసరావు, లింగం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆశిపాప వీధిలో..

దాబాగార్డెన్స్: పాతనగరం ఏవీఎన్ కళాశాల డౌన్ రోడ్డు ఆశిపాప వీధిలో వెలసిన పోలమాంబ పరస మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు జరిపారు. ఆశిపాపవీధి, ఏవీఎన్ కాలేజీ డౌన్‌రోడ్డు, గొడారి గోతులు, టౌన్ కొత్తరోడ్డు, వెలంపేట, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. సాయంత్రం పెద్ద ఎత్తున నిర్వహించిన పరసలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలి



జేఏసీ సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

దాబాగార్డెన్స్: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపులు వెంటనే ఆపాలనిఅఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. మంగళవారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో జేఏసీ సమావేశం నిర్వహించింది. సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ ఎం. జగ్గునాయుడు, వైస్ చైర్మన్లు బి. నాగభూషణం, ఎం. మన్మథరావు, సీఎఫ్‌టీయూఐ అధ్యక్షుడు ఎన్. కనకారావు, ఏపీఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు దేవా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 600 మందిని టెండర్లు అయిపోయాయనే పేరిట నిలిపివేసిందన్నారు. అలాగే 1503 మందిని తొలగిస్తున్నట్టు లిస్ట్‌లో ప్రకటించారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొండి వైఖరి విడనాడాలని కోరుతూ కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు ఎప్పుడు సమ్మె చేసిన తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు ఎస్. జ్యోతీశ్వరరావు, పి. మణి, బి. జగన్, వై. రాజు, చంద్రశేఖర్, యూఎస్ఎన్ రాజు, కేఏజే రావు, కేవీపీ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కవి సమ్మేళనానికి ఆహ్వానం



ధర్మారావు

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు ధర్మారావుకు ప్రతిష్ఠాత్మక ఆహ్వానం లభించింది. వచ్చే నెల 8న హైదరాబాదులోని త్యాగరాజ గానసభలో తెలుగు భాషా చైతన్య సమితి నిర్వహించనున్న 'తెలుగు భాషకు పట్టాభిషేకం' అంతర్జాతీయ కవిసమ్మేళనంలో కవితా గానం చేసేందుకు ఆయనను ఆహ్వానించారు. ఈ మేరకు తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షుడు బడేసాబ్ ఆహ్వాన పత్రికను పంపినట్లు ధర్మారావు తెలిపారు. తెలుగు భాషా చైతన్య సమితి 12వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. అంతర్జాతీయ కవిసమ్మేళనంలో పాల్గొనేందుకు ఆహ్వానం అందుకున్న ధర్మారావును పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనరస, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

పరదేశమ్మ ఆలయాభివృద్ధికి రూ. 50 వేల విరాళం

తాటిచెట్లపాలెం: రైల్వేన్యూకాలనీ, తాటిచెట్లపాలెం పరిసర ప్రాంతాల్లో వెలసిన పరదేశమ్మ ఆలయంలో అభివృద్ధి పనులకు గాను కృష్ణవేణి బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత, ఏపీఐఐసీ మాజీ స్టేట్ డైరెక్టర్ ఆళ్ల శివగణేష్ రూ. 50 వేలు ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఆలయంలో గల అమ్మవారి విగ్రహానికి సంబంధించిన ఏనుగులకు ఒక కేజీ వెండి తాపడం చేయించేందుకు గాను ఈ నగదును అడ్వాన్స్‌గా అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు దాడి శ్రీనివాసరావు, కార్యదర్శి సన్యాసిరావు, కాశీప్రసాద్, సదరం ఆంజనేయులు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
E.P. No. 24 of 2018 in O.S. No. 557 of 2010

Between:
Chintapalli Srinivas ..... Decree Holder/ Plaintiff
And:
Moola Chandra Kala ..... Judgement Debtor/ Defendant
To,
Moola Chandra Kala, W/o. Parasuram, Flat No. 8, Premier Paradise-1, Official Colony, 3rd lane, Maharanipeta, Visakhapatnam
.....Judgement Debtor/ Defendant

AUCTION NOTICE

యిందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని పై నెంబరు డిక్రీ అమలులో సొమ్ము రాబట్టే నిమిత్తం పై ఉదహరించిన న్యాయస్థానంలో **తేది: 02-05-2025ని ఉదయం 10.30 ని॥ నుండి సాయంత్రం 5 గం॥ల మధ్య కాలంలో** బహిరంగ వేలం వేయబడును. కావున కావలసినవారు ఆ సమయంలో వేలంలో పాల్గొనవచ్చునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

SCHEDULE PROPERTY

Schedule property i.e., 31 Sq.yards being undivided and unspecified share out of the total extent of 484 Sq.yards together with flat no. S1 measuring 950 Sft of Premier Paradise situated at Official Colony, 3rd lane, D.No. 16-8-18 & 19, Maharanipeta ward Visakhapatnam within the limits of Greater Visakhapatnam Municipal Corporation, Visakhapatnam and bounded by: **East:** Challavari House, **South:** Municipal Road, **West:** House of late Karra Venkata Rao, **North:** Municipal road.
Boundaries of the Flat No. S1 in Second floor which is JDR's property:
East: Open Space, **South:** S2 Flat, **West:** Open Space, **North:** Open Space.
DHR Value - Rs. 7,50,000/-, Ameena Value - Rs. 15,00,000/-
Visakhapatnam — **Y.JYOTHI VIJAYA,** Advocate
Date: 15-04-2025 — D.No. 17-1-24, Maharanipeta, Visakhapatnam